నేటి నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు

- 11 రోజులపాటు వేడుకలు
- తొలిరోజు పూజలో పాల్గొననున్న ముఖ్యమంత్రి, మంత్రులు

యాదాద్రిభువనగిరి, మార్చి 10 (నమస్తే తెలంగాణ): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు స్వయంభూ పంచ నారసింహుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు స్వస్తీవాచనం, అంకురారోపణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 21న శృంగార డోలోత్సవంతో వేడుకలు పరిపూర్ణం కానున్నాయి. ప్రధాన ఆలయ ఉద్ఘాటన తర్వాత రెండోసారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్తర మాడ వీధుల్లో స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజులపాటు స్వామివారి నిత్య, మొక్కు, కల్యాణాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపేసినట్టు అధికారులు తెలిపారు. కాగా.. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 10 వేల మంది కూర్చునేలా ప్రత్యేక కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులంతా విచ్చేయనున్నారు. స్వామివారికి రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం ఉంది. 11 గంటలకు సీఎం, మంత్రులు తిరిగి హెలికాప్టర్‌లో భద్రాచలం పర్యటనకు బయల్దేరి వెళ్లనున్నారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి వస్తున్న నేపథ్యంలో కొండపైన దేవస్థానం ఆంక్షలు విధించింది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తున్నట్టు ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొండపైకి భక్తులను, వాహనాలను అనుమతించడం లేదని స్పష్టం చేశారు.

డీఎస్పీ ప్రణీత్‌రావుపై కేసు

ఖైరతాబాద్, మార్చి 10: రాష్ట్రంలోని ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీ డీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావుపై పంజాగుట్ట పోలీసులు నాన్-బెయిలబుల్ కేసు నమోదు చేశారు. అదనపు ఎస్పీ డీ రమేశ్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. 2023లో డీఎస్పీగా ఉన్న ఆయనకు రెండు ప్రత్యేక గదులు, 17 కంప్యూటర్లు, ప్రత్యేక లీజ్డ్ లైన్‌తో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించారు. చట్టవిరుద్ధంగా ఆయన పలువురి ఫోన్లను ట్యాప్ చేసి, ఆ సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లు, ఇతర ఎక్స్‌టర్నల్ హార్డ్‌డిస్కుల్లో భద్రపరిచాడని, డిసెంబర్ 4న అవన్నీ నాశనం చేసి, సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశాడని దర్యాప్తులో తేలింది. దీంతో ప్రణీత్‌రావుపై పీడీపీపీ యాక్ట్-1984తోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది.

విద్యా - ఉద్యోగ సమాచారం

ముందస్తు దరఖాస్తుతో కోరుకున్న సెంటర్

- ఎప్‌సెట్‌కు మందకొడిగా దరఖాస్తులు
- ఆలస్యమైతే పరీక్షాకేంద్రం దూరంగా పడే అవకాశం
- ఇప్పటివరకు దరఖాస్తు చేసింది 73 వేల మందే

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ పరీక్షలు ముగింపు దశకు చేరుకోవడంతో విద్యార్థులు ముందుగానే ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేయాలని అధికారుల సూచిస్తున్నారు. ఏటా ఎప్‌సెట్‌కు ఆఖరు నిమిషంలో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. దీంతో సెంటర్ల సామర్థ్యం సరిపోక బ్లాక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో మరోచోట పరీక్ష రాయాల్సి వస్తున్నది. నిరుడు సామర్థ్యం సరిపోక 13 పట్టణాలను బ్లాక్ చేశారు. దీంతో హైదరాబాద్ లేక మరో ప్రాంతంలో సెంటర్‌ను కేటాయించడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు.

ఏపీ, తెలంగాణల్లో మొత్తం 21 టెస్ట్ జోన్లు

ఎప్‌సెట్ పరీక్ష కోసం ఏపీ, తెలంగాణల్లో మొత్తం 21 టెస్ట్ జోన్లను అధికారులు ఏర్పాటుచేశారు. తెలంగాణలో 16, ఏపీలో 5 టెస్ట్ జోన్లు ఉన్నాయి. ప్రత్యేకించి హైదరాబాద్‌లోనే నాలుగు జోన్లున్నాయి. విద్యార్థి మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకున్న జోన్‌లోనే పరీక్షాకేంద్రాన్ని కేటాయిస్తారు. సామర్థ్యం లేకపోతే మాత్రం ఖాళీ ఉన్న మరో జోన్‌లో కేటాయిస్తారు. నిరుడు హయత్‌నగర్‌ను హిమాయత్‌సాగర్ అనుకొని ఓ విద్యార్థి హైదరాబాద్-3 జోన్‌ను ఎంపిక చేసుకున్నాడు. హిమాయత్‌సాగర్ హైదరాబాద్-4 జోన్‌లో ఉండగా, పరీక్షాకేంద్రం దూరంగా హయత్‌నగర్‌లో పడింది. దీంతో సదరు విద్యార్థి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇలాంటి విషయాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని జేఎన్టీయూ అధికారులు సూచించారు. ఈ సారి తెలంగాణలో పరీక్షాకేంద్రాల సామర్థ్యాన్ని పెంచారు. ఒక్కో సెషన్‌కు గతంలో 27 వేల మందికి పరీక్ష నిర్వహించే అవకాశం ఉండగా, ఈ సారి ఆ సామర్థ్యాన్ని 35 వేలకు పెంచారు. ఒక్కో సెంటర్‌లో 10 శాతం కంప్యూటర్లకు బఫర్‌గా అందుబాటులో ఉంచుతారు. సాంకేతిక సమస్య తలెత్తితే వీటిల్లో నుంచి ఒక కంప్యూటర్‌ను విద్యార్థులకు కేటాయిస్తారు.

మందకొడిగా దరఖాస్తులు

ఎప్‌సెట్‌కు దరఖాస్తులు మందకొడిగా వస్తున్నాయి. ఆదివారం వరకు మొత్తం 73,476 మంది విద్యార్థులే దరఖాస్తు చేసుకున్నారు. ఇంజినీరింగ్‌కు 47,769, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 25,627, రెండింటికి హాజరయ్యేందుకు 80 మంది చొప్పున దరఖాస్తులు సమర్పించారు. నిరుడు 3,20,683 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన మరో 2.5 లక్షల మంది దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉంది. ఫిబ్రవరి 26 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా, మే 6 వరకు గడువు ఉంది. ఆలస్య రుసుముతో మే 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత దరఖాస్తులు జోరందుకునే అవకాశం ఉంది.

భూమి ఇప్పిస్తానని కాంగ్రెస్ నేత మోసం

- పెట్రోల్ పోసుకుని దంపతుల ఆత్మ హత్యాయత్నం
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి హామీతో శాంతించిన బాధితులు

ములుగు, మార్చి 10 (నమస్తేతెలంగాణ): ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు, మంత్రి సీతక్క అనుచరుడు బానోత్ రవిచందర్.. తమకు భూమి ఇప్పిస్తానని మోసం చేశాడని ఇద్దరు దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన ములుగు మండలం జీవంతరావుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ములుగు జిల్లా కేంద్రంలోని సమ్మయ్యనగర్ కాలనీలో భూమి ఇప్పిస్తానని 2013లో నిగ్గుల సుధాకర్ నుంచి రవిచందర్ రూ.లక్షా 80 వేలు తీసుకున్నాడు. 9 ఏండ్లుగా భూమి ఇప్పించకుండా.. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా మాయమాటలు చెప్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. తాను, మంత్రి సీతక్క కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని, సమ్మయ్యనగర్ కాలనీలో సుధాకర్‌కు రావాల్సిన భూమిని వేరే వారికి విక్రయించాడు. తమకు వేరే చోట భూమి ఇప్పిస్తామని నమ్మబలికాడు. తీరా డబ్బులు వాడుకుని ముఖం చాటేశాడు. దీంతో ఆవేదనకు గురైన నిగ్గుల సుధాకర్, అతని భార్య శారద గ్రామంలోని తమ ఇంట్లో ఆత్మహత్య చేసుకుంటామని పెట్రోల్ బాటిల్ పట్టుకుని తలుపులు మూసుకున్నారు. విషయం తెలుసుకున్న ములుగు ఎస్సై-2 రామకృష్ణ అక్కడికి వెళ్లి కిటికీలో నుంచి సుధాకర్‌ను సముదాయించే ప్రయత్నం చేయగా.. వారు రవిచందర్ చేసిన మోసాన్ని ఎస్సైకి వివరించారు. తమకు న్యాయం చేయాలని మంత్రి సీతక్కను కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించినా.. మంత్రిని కలువకుండా రవిచందర్ అడ్డుకున్నారని వాపోయారు. దీంతో ఎస్సై.. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. స్పందించిన అశోక్.. సుధాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని, ఆత్మహత్య లాంటివి ఏమి చేయొద్దని, మంత్రి సీతక్క ఇతర పనుల్లో బిజీగా ఉన్నారని, ధైర్యంగా పోరాడేందుకు ముందు రావాలని సుధాకర్‌కు వివరించాడు. అశోక్ హామీతో సుధాకర్, అతని భార్య శారద ఆత్మహత్యాయత్నాన్ని విరమించుకొని ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఎస్సై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆదివారం హైటెక్స్‌లో జరిగిన క్రెడాయ్ పాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో జ్ఞాపిక అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

'రియల్' అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- క్రెడాయ్ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో మంత్రులు భట్టి, ఉత్తమ్ భరోసా

జూబ్లీహిల్స్, మార్చి 10: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం వారు హైటెక్స్‌లో క్రెడాయ్ పాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ.. తెలంగాణలో రియల్ ఎస్టేట్, అనుబంధ రంగాలను బలోపేతం చేయడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన రోడ్లు, విద్యుత్తు, నీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఆమోదించిన ప్రాజెక్టులను మాత్రమే ఈ ప్రాపర్టీ షోలో ప్రదర్శనకు ఉంచినట్టు క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రియల్ రంగంలో చెన్నై, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ నగరాల కంటే హైదరాబాద్ ముందువరుసలో ఉన్నదని క్రెడాయ్ ప్రధాన కార్యదర్శి బీ జగన్నాధరావు అన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్ జైదీప్‌రెడ్డితోపాటు పలువురు డెవలపర్లు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆందోళన చేస్తున్న బెంగళూరు వెళ్లాల్సిన ప్రయాణికులు

శంషాబాద్ రూరల్, మార్చి 10: శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బెంగుళూరు వెళ్లాల్సిన విమానం మూడు గంటలపాటు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ (శంషాబాద్) ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరు మధ్యాహ్నం 3.55గంటలకు వెళ్లాల్సిన విమానం సాయంత్రం ఆరు వరకు వెళ్లలేదు. ఆలస్యంపై ఎన్నిసార్లు అడిగినా ఎయిర్‌పోర్టు అధికారులు సమాధానమివ్వలేదని ఆందోళకు దిగినట్టు ప్రయాణికులు తెలిపారు. ప్రయాణికుల్లో చిన్నపిల్లలు సైతం ఉన్నట్టు సమాచారం. సాయంత్రం 7 గంటలకు ప్రయాణికులను మరో విమానంలో తరలించినట్టు ప్రయాణికులు తెలిపారు. ఎయిర్‌పోర్టు, ఎయిర్‌లైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో కనీసం తాగడానికి నీళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తున్నది.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట: ఆర్టీసీ ఎండీ

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులతో ఆ సంస్థ ఎండీ సజ్జనార్ ఆదివారం వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఉద్యోగులతో ముచ్చటించారు. వేతన సవరణతో ఉద్యోగుల బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని తెలిపారు. మిగతా సమస్యలను ప్రభుత్వ సహకారంతో పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎండీ హామీ ఇచ్చారు. మెరుగైన, నాణ్యమైన సేవలందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి, జాతీయ స్థాయిలో సంస్థకు మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. వర్చువల్ సమావేశంలో సీవోవో డాక్టర్ రవీందర్, ఈడీ మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, సీటీఏ జీవనప్రసాద్, సీటీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేత భర్తే హంతకుడు

భార్యను చంపి హైదరాబాద్‌కు పయనం

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియాలోఉంటున్న శ్వేత అలియాస్ చైతన్య మాదగాని హత్య కేసులో భర్త వరికుప్పల అశోక్‌రాజ్‌ని హంతకుడిగా ఆస్ట్రేలియా పోలీసులు నిర్ధారించారు. చైతన్యను ఆమె భర్తే చంపి చెత్త డబ్బాలో వేసినట్టు తేలడంతో అశోక్‌రాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చైతన్య హత్య చేసిన తర్వాత అశోక్‌రాజ్ కొడుకుతో హైదరాబాద్‌లోని ఏఎస్‌రావునగర్‌లో ఉన్న తన ఇంటికి వచ్చాడు. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి విక్టోరియా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. వారం క్రితం ఆస్ట్రేలియా విక్టోరియా బక్లీలో రోడ్డు సమీపంలో ఉన్న ఓ చెత్త డబ్బాలో చైతన్య మృతదేహాన్ని అతడు దాచిపెట్టాడు. చైతన్య చెల్లెలు రాచకొండ కుషాయిగూడ పోలీసులకు సమాచారం అందించింది. హత్యకు గురైన చైతన్య ఏఎస్‌రావునగర్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బాల్‌శెట్టి గౌడ్, మాధవి కుమార్తె. చైతన్య, అశోక్ రాజ్‌లది పెద్దలు కుదిర్చిన వివాహం. ఉపాధి నిమిత్తం ఆస్ట్రేలియాలో ఉంటున్న అశోక్.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తరుచూ భార్యాభర్తల మధ్య వివాదాలు వస్తున్నాయని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

హుస్నాబాద్‌లో హాఫ్ మారథాన్

హుస్నాబాద్, మార్చి 10: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రన్నర్స్ అసోసియేషన్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ (21 కిలోమీటర్ల పరుగు పందెం)ను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. హాఫ్ మారథాన్‌తోపాటు 10కే రన్, 5కే రన్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హాఫ్ మారథాన్ పూర్తి చేసిన హైదరాబాద్‌కు చెందిన అంధుడు లక్ష్మీనారాయణతోపాటు 75 ఏండ్ల వృద్ధుడు నాగభూషణాన్ని మంత్రి పొన్నం సన్మానించారు.

317 జీవోపై క్యాబినెట్ కమిటీలో చర్చిస్తాం

- మంత్రి దామోదర రాజనర్సింహా హామీ

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): క్యాబినెట్ సబ్ కమిటీలో 317 జీవోపై చర్చిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హామీ ఇచ్చారు. వైద్యశాఖకు చెందిన పలువురు ఉద్యోగులు ఆదివారం మంత్రిని కలిసి 317 జీవో ద్వారా కలుగుతున్న ఇబ్బందులను వివరించి, వినతిపత్రం సమర్పించారు. సబ్ కమిటీ చొరవ తీసుకుంటే రాష్ట్రంలోని ఉద్యోగులు, వారి కుటుంబాలతోపాటు స్థానికత, పదోన్నతులు, బదిలీలు, స్పౌజ్ కేసుల సమస్యలు పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై సబ్ కమిటీతో కలిసి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా.. నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఉద్యోగ సంఘాలతో సీఎం నిర్వహించిన సమావేశానికి వారు హాజరయ్యారు. వైద్యవిధాన పరిషత్తు ఉద్యోగులకు ట్రెజరీ నుంచి వేతనాలు ఇవ్వాలని కోరారు.

'పద్మశ్రీ అందుకున్న పేదలను ఆదరించండి'

హైదరాబాద్, మార్చి10 (నమస్తే తెలంగాణ) : పేదవర్గాల నుంచి వికసించిన పద్మశ్రీ గ్రహీతలకు రూ.50 వేల పెన్షన్, ఉచిత రవాణా సౌకర్యం, రూ.10 లక్షల విలువైన హెల్త్ కార్డులు ఇచ్చి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలువాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణ నుంచి పద్మశ్రీ అందుకున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 లక్షల నగదు పారితోషకం, రూ.25 వేల పెన్షన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి 28 మందికి పద్మశ్రీ వచ్చిందని, వీరందరికీ ఇదే తరహాలో సౌకర్యాలను కల్పించాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

డ్రగ్స్‌పై అవగాహనకు క్రికెట్ టోర్నమెంట్లు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని పల్లెపట్నాల్లో డ్రగ్స్‌పై, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో టీఎస్ న్యాబ్, టీడీఎఫ్ కెనడా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ స్థాయిల్లో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. యువకులను డ్రగ్స్, సెల్‌ఫోన్ వ్యసనం నుంచి కాపాడేందుకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం పలు కార్యక్రమాలు చేపడుతున్నది. ముఖ్యంగా డ్రగ్స్‌పై అవగాహన తీసుకొచ్చేందుకు, తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో అధికారుల సహకారంతో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీడీఎఫ్ కెనడా బాధ్యులు తెలిపారు.

కన్న బిడ్డలనే కడతేర్చారు!

- పాలల్లో పురుగు మందు కలిపి చిన్నారులకు తాగించారు
- ఈ దారుణం తల్లిదండ్రుల పనే?

గార్ల, మార్చి 10: చిన్నారులకు పాలల్లో పురుగు మందు కలిపి హతమార్చిన విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం.. సీతంపేట గ్రామ పంచాయతీ శివారు అంకన్నగూడేనికి చెందిన పెండగట్ల అనిల్‌కుమార్, దేవికి ఐదేండ్ల క్రితం వివాహమైంది. వీరికి లోహిత(2), 11 నెలల జస్విత ఉన్నారు. అనిల్ ట్రాక్టర్ డ్రైవింగ్‌తోపాటు వ్యవసాయం చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. వారం రోజులుగా వీరు అత్తగారిల్లు అయిన నామాలపాడులో ఉంటున్నారు. శనివారం సాయంత్రం అంకన్నగూడెం వచ్చారు. రాత్రి భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు కాని, ఇద్దరు చిన్నారులకు పాలల్లో పురుగు మందు కలిపి తాగించారు. వెంటనే అనిల్‌కుమార్, దేవి అక్కడి నుంచి పారిపోయారు. పక్కనే ఉండే చిన్నారుల తాత పెండగట్ల వెంకన్న ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి చూడగా ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్టు గమనించి ఇరుగు పొరుగు వారికి తెలిపాడు. మంచం పక్కన పాల డబ్బా, పురుగుమందు డబ్బా పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ తిరుపతి, గార్ల-బయ్యారం సీఐ రవి, ఎస్సై జీనత్ కుమార్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. వెంకన్న ఫిర్యాదుతో ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రిన్సిపాల్ దారుణహత్య

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ఏపీలోని అనంతపురంలో ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దారుణహత్యకు గురయ్యారు. నగరంలోని జేఎన్టీయూ ప్రవేశద్వారానికి ఎదురుగా ఉండే కాలనీలో నివాసముండే మూర్తిరావు ఖోకలే గతంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ)లో పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఖోకలే మేనల్లుడు ఆయనపై దాడిచేసి బ్లేడ్‌తో గొంతు కోశాడని పోలీసులు తెలిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడని, ఆస్తి తగాదాలు, కూతురు పెళ్లి విషయం నచ్చక హత్య చేసి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సినీ నిర్మాత రాంబాబు కన్నుమూత



మిర్యాలగూడ టౌన్, మార్చి 10 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన సినీ నిర్మాత పొలిశెట్టి రాంబాబు (58) శనివారం రాత్రి మృతి చెందారు. రాంబాబు మొదట ప్రజానాట్యమండలి కళాకారుడిగా పనిచేశారు. ఆ తరువాత హైదరాబాద్ వెళ్లి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడి సినీ నిర్మాతగా మారారు. ఆయనకు భార్య సంధ్యారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సినీ నటుడు అల్లరి నరేశ్‌తో గోపి (గోడ మీద పిల్లి), లక్ష్మీపుత్రుడు సినిమాలు తీశారు. కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఇటీవల హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చేర్పించారు. అమెరికాలో ఉంటున్న చిన్నకుమార్తె శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత వెంటిలేటర్ తొలగించారు. అదేరోజు రాత్రి మిర్యాలగూడకు తీసుకురాగా కొనఊపిరితో ఉన్న ఆయన్ను మరో ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి, తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్ తదితరులు రాంబాబు మృతదేహానికి నివాళులర్పించారు. ఆదివారం మధ్యాహ్నం పెద్దకుమార్తె అంజు చేతుల మీదుగా హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బండి సంజయ్ యాత్రలో ఉద్రిక్తత

- రాళ్లు రువ్విన గుర్తు తెలియని వ్యక్తులు
- ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్త చికెన్ సెంటర్ ధ్వంసం
- జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో ఘటన

కొడిమ్యాల, మార్చి 10: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్రలో ఉద్రిక్తత నెలకొన్నది. ఆదివారం జగిత్యాల జిల్లా మల్యాల, కొడిమ్యాల మండలాల్లో యాత్ర కొనసాగింది. రాత్రి కొడిమ్యాల మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి బైపాస్ మీదుగా అంగడి బజార్ వరకు యాత్ర చేపట్టారు. యాత్ర బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ కార్యకర్తకు చెందిన చికెన్ సెంటర్ ముందు నుంచి వెళ్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో యాత్రలోని ప్రజల మీద పడ్డాయి. దీంతో చికెన్ సెంటర్ నిర్వాహకులే రాళ్లు రువ్వారని బీజేపీ నాయకులు ఎదురు దాడికి దిగారు. చికెన్ సెంటర్‌ను ధ్వంసం చేశారు. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తీవ్రమైన గొడవ జరగడంతో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చెదరగొట్టారు. దీంతో గొడవ సద్దుమణిగింది. కాగా.. బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. బండి సంజయ్ ప్రజాహిత పాదయాత్ర కారణంగా నాచుపల్లి నుంచి గోవిందారం వెళ్లే ఓ అంబులెన్స్ దాదాపు 40 నిమిషాల పాటు చిక్కుకుపోయింది. అంబులెన్స్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రోగి ఇబ్బందులు పడ్డాడు.

మన ఘన చరిత్రను ముందు తరాలకి తెలియచేద్దాం
ఈ నెల 15న బ్రహ్మాండమైన విడుదల

సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

అంజలి 70 ఎంఎం ఏ/సి-సికింద్రాబాద్
SVC ఈశ్వర్ 70 ఎంఎం ఏ/సి- అత్తాపూర్
ఇంద్రనాగేంద్ర కంప్లెక్స్-కర్మన్‌ఘాట్
శ్రీరాములు 70 ఎంఎం ఏ/సి-మూసాపేట్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట్
తాళ్ళూరి కాంప్లెక్స్- ఇ.సి.ఐ.ఎల్
గోకుల్ 70 ఎంఎం ఏ/సి- ఎర్రగడ్డ
సంపూర్ణ 70 ఎంఎం ఏ/సి- వనస్థలిపురం
రంగ 70 ఎంఎం ఏ/సి- జీడిమెట్ల
SVC సంగీత 70 ఎంఎం ఏ/సి- ఆర్.సి.పురం
SVC శివశక్తి 70 ఎంఎం ఏ/సి- కాప్రా
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట
శ్రీ సాయిరామ్ 70 ఎంఎం ఏ/సి- మల్కాజ్‌గిరి
శ్రీకృష్ణ 70 ఎంఎం ఏ/సి- ఉప్పల్
నర్తకి 70 ఎంఎం ఏ/సి- అల్వాల్
సాయిపూజ 70 ఎంఎం ఏ/సి- సూరారం
స్వప్న 70 ఎంఎం ఏ/సి- కాటేదాన్
లక్ష్మి 70 ఎంఎం ఏ/సి-శంషాబాద్

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
ఏఎంబి - గచ్చిబౌలి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR పివిఆర్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ - మూసారంబాగ్
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి
PVR ఎస్2 ఎ/సి - మల్లాపూర్
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్
INOX ఎం.పి.మాల్ - కాచిగూడ
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
INOX సత్వనెక్లెస్ మాల్స్ - కవాడిగూడ
INOX అశోక ఎ/సి - వై.జంక్షన్
Cinépolis లులు మాల్ - కూకట్‌పల్లి
Cinépolis CCPL - మల్కాజ్‌గిరి
Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్
Cinépolis సుధ - శాలిబండ
Cinépolis డి.ఎస్.ఎల్. - ఉప్పల్
ఏఏఏ - అమీర్‌పేట్
సినీమార్ట్ - ఆర్.సి.పురం
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
సినీ స్క్వేర్ - ఉప్పల్
ఏషియన్‌రాధిక - కాప్రా
ఎంక్యూబ్ - అత్తాపూర్
ఎం.జె.ఆర్ - నారపల్లి
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
GPR జిపిఆర్ - కూకట్‌పల్లి
ప్లాటినమ్ - అమీర్‌పేట్
ప్లాటినమ్ - గచ్చిబౌలి
స్కైమాల్ - సనత్‌నగర్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్‌బినగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షాహెన్‌షా - చింతల్
AMR ఎఎంఆర్ - మౌలాలి
జెపి ఎ/సి - చందానగర్

మరియు మీ అభిమాన థియేటర్లలో | BHUVANESHWARI PICTURES